RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 167 పేజీలు - 08 గురువారం 14 మే 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## హైదరాబాద్‌లో ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్

- ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పోరేట్ ఆఫీస్
- సిఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సిఇవో దారా ఖోస్రోషాహి వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మిగతా2లో...

## బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెళి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే. ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మిగతా2లో...

## బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

- ఆయనను రక్షించాల్సిన అవసరం మాకేముంది
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. మిగతా2లో...

## క్రూడాయిల్ సంక్షోభం కొనసాగితే దేశంలో చమురు ధరల పెంపు తప్పదు: ఆర్బీఐ గవర్నర్



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 13:** దేశంలో పెట్రో ధరల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. మిడిల్ ఈస్ట్ వార్, క్రూడాయిల్ ధరల పెరుగుదల కారణంగా దేశంలో పెట్రో ధరలు క్రమంగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయని, ద్రవ్యోల్బణం, చమురు మిగతా2లో...

## 15న ఆధారాలతో విచారణకు వస్తా...

- పోలీసులకు బండి భగీరథ్ లేఖ




## నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

- దేశంలో ఏకకాలంలో సోదాలు
- ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ప్రకటన




## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం


- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని




**తొలి అక్షరం/పుదుచ్చేరి,మే 13:** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా మిగతా2లో...

## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్



**తొలి అక్షరం/చెన్నై,మే 13 :** తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బల పరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, మిగతా2లో...

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్



**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు. ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు

మిగతా2లో...

## పొదుపు సూత్రాలు తెలంగాణకు... నిధులు మాత్రం ఆంధ్రాకా ..?


- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్




**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి మిగతా2లో...

## పొదుపు బాటలో సిఎం చంద్రబాబు

- కాన్వాయ్‌లో 50శాతం వాహనాల తగ్గింపు
- డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో సమావేశంలో ఆదేశాలు



**తొలి అక్షరం/అమరావతి,మే 13:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించిన ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పర్యటనల సమయంలో తన కాన్వాయ్‌లో ఉండే వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని మోదీ ఇటీవల సూచించిన నేపథ్యంలో

మిగతా2లో...

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫీట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ హెచ్చరించారు. పశువుల రవాణాపై ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలే తప్ప, నేరుగా రోడ్లపైకి వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించకూడదని ఖురేషీలు, గోరక్షక బృందాలకు సూచించారు. నిబంధనలు మీరి రాద్ధాంతం చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు సస్పెక్ట్ షీట్లు కూడా ఓపెన్ చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు రెండువర్గాల వారితో విడివిడిగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కోరారు.

# నీట్ పేపర్ లీక్‌లో సిబిఐ దూకుడు

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మే 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీబీఐ అధికారులు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకుంది. నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సీబీఐ తన దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీబీఐ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకేసారి సోదాలు నిర్వహిస్తోంది. ఈ లీకేజ్ వెనుక ఉన్న ప్రధాన ముఠాను బయటకు తీసుకు రావడానికి అధికారులు కృషి చేస్తున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ప్రత్యేక బృందాలు రాజస్థాన్, హరియాణా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. సోదాల సమయంలో అనేక ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, డాక్యుమెంట్లు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీబీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రశ్నాపత్రం లీక్, మధ్యవర్తుల వ్యవస్థ, భారీ మొత్తాల్లో డబ్బుల లావాదేవీలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ వ్యవహారంలో పరీక్షకు ముందుగానే కొందరు అభ్యర్థులకు ప్రశ్నాపత్రం అందించినట్లు అనుమానిస్తున్నారు. సీబీఐ అధికారులు ఇప్పటివరకు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందినవారు కాగా, ఒకరు హరియాణాలోని గురుగ్రామ్‌కు చెందిన వ్యక్తి. మరొకరు మహారాష్ట్ర లోని నాసిక్ ప్రాంతానికి చెందిన వారు. అరెస్టయిన వ్యక్తులు ప్రశ్నాపత్రం సేకరణ, పంపిణీ, అభ్యర్థులతో సంబంధాలు ఏర్పరచడం వంటి కీలక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచి కస్టడీకి తీసుకుని సమగ్రంగా విచారిస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జమ్వా రామ్‌గఢ్ ప్రాంతానికి చెందిన మంగీలాల్, దినేశ్ బివాల్ సోదరులను సీబీఐ అధికారులు బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరు ఈ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాన మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్నారు. వారి ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో పలు డిజిటల్ ఆధారాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, అభ్యర్థుల జాబితాలు లభించినట్లు సమాచారం. వీరి ద్వారా మరికొందరు అనుమానితుల వివరాలు కూడా సీబీఐకి లభించినట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లో సోదాలు కొనసాగుతుండగానే మహారాష్ట్రలో కూడా సీబీఐ తన దర్యాప్తును విస్తరించింది. అక్కడ ఇద్దరు మహిళలను అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మహిళలు అభ్యర్థులు, మధ్యవర్తుల మధ్య సంబంధాలు ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి ఫోన్ కాల్ రికార్డులు, బ్యాంక్ లావాదేవీలు, సోషల్ మీడియా కమ్యూనికేషన్లను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారం అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ ద్వారా నిర్వహించినట్లు సీబీఐ అధికారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుంది. దిల్లీలోని 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్‌టీఏ) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి.. రద్దయిన పరీక్షకు సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సేకరించింది. ఈ పరీక్షా ప్రక్రియలో పాలుపంచుకున్న అధికారులతో సీబీఐ బృందం మాట్లాడినట్లు అధికారులు తెలిపారు. ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో.. ఈ నెల 3న నిర్వహించిన నీట్-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే.

# పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం మీడియాతో రంగస్వామి మాట్లాడారు. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిపై మరింతగా దృష్టి సారిస్తుందని, ప్రజా సంక్షేమం కోసం అవసరమైన అన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పుదుచ్చేరిని ప్రధాన అభివృద్ధి, పర్యాటక కేంద్రంగా మార్చనున్నట్లు కూడా ఆయన తెలిపారు. పుదుచ్చేరిని సింగపూర్‌లా అభివృద్ధి చేయబోతున్నట్లు సీఎం రంగస్వామి ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంపై ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టు పెట్టారు. 'పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎన్.రంగస్వామికి అభినందనలు. అక్కడ అభివృద్ధి ప్రస్థానాన్ని బలోపేతం చేసిన అనుభవజ్ఞుడైన, సమర్థవంతమైన పరిపాలకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. కొత్త మంత్రులు పురోగతికి దోహదపడతారని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నాను' అని మోదీ పోస్టు చేశారు. 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకుంది. ఈ కూటమిలో సీఎం రంగస్వామికి చెందిన ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ 12 స్థానాలు గెలుచుకోగా, బీజేపీ 4 స్థానాలను కైవసం చేసుకుంది. ఏఐఏడీఎంకే, ఎల్జేకే చెరో స్థానాన్ని దక్కించుకున్నాయి. మరోవైపు ప్రతిపక్షాలైన డీఎంకే 5 స్థానాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఒక స్థానం గెలుచుకున్నాయి. ఇక, విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం రెండు స్థానాలతో ఖాతా తెరిచింది.

# పొదుపు బాటలో సిఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కూడా దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలనే ఉద్దేశంతో ఈ ఆదేశాలు ఇచ్చారు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌తో జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. జిల్లా పర్యటనల్లో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని అధికారులను ఆదేశించారు. భద్రతా ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుంటూనే అనవసర వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్‌కే పరిమితం కాకుండా మంత్రులు, ఇతర వీఐపీలు కూడా సాధ్యమైనంత తక్కువ వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. అన్ని స్థాయిల్లో 50 శాతం వాహనాల తగ్గింపు అమలు అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవస్థలో పొదుపు సంస్కృతి పెంపొందించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఇంధన వినియోగం తగ్గించడం ద్వారా ఆర్థిక భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అవుతుందని సీఎం తెలిపారు. కాన్వాయ్ వాహనాల తగ్గింపుతో పాటు ప్రభుత్వ ఖర్చుల నియంత్రణ, ఇంధన పొదుపు, పరిపాలనా వ్యయాల తగ్గింపు వంటి అంశాలపై ఇప్పటికే అధికార స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. ఈ అంశాల పై రేపు(గురువారం) జరిగే కేబినెట్ సమావేశంలో విస్తృత చర్చ జరగనుండగా, మరిన్ని కీలక విధాన నిర్ణయాలను సీఎం చంద్రబాబు ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వ పరిపాలనలో సరళీకరణ, ఖర్చుల నియంత్రణ, వనరుల సమర్థ వినియోగం దిశగా సీఎం చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారింది. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ప్రజలకు కూడా పొదుపు సందేశం వెళ్లేలా ఈ చర్యలు ఉపయోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

(మొదటి పేజీ తరువాయి)

వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాస పరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది' అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారిగా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. 'ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది' అని ఉదయనిధి విమర్శించారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. 234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

# క్రూడాయిల్ సంక్షోభం కొనసాగితే దేశంలో చమురు ధరల పెంపు తప్పదు: ఆర్బీఐ గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతులపై ప్రభావం తప్పదని అభిప్రాయపడ్డారు. స్విట్జర్లాండ్‌లో జరిగిన స్విస్ నేషనల్ బ్యాంక్ అండ్ ద ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ సదస్సులో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల ప్రభావం నుంచి ప్రభుత్వం ప్రజల్ని నిరంతరం రక్షించలేదన్నారు. నిరంతరం ధరల పెరుగుదల కొనసాగితే, ప్రభుత్వం దేశంలో పెట్రో ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకునేందుకు ఎంతో సమయం పట్టదన్నారు. ఇప్పటికే చమురు ధరల్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాల్ని తగ్గించిందని గుర్తు చేశారు. ఆయిల్ కంపెనీల నష్టాలను ప్రభుత్వం భరిస్తూ వస్తోందని, ధరల్ని అదుపులో ఉంచుతోందని వెల్లడించారు. అయితే, ప్రభుత్వం ఎంతకాలం ఈ పని చేయగలదనేది సందేహమన్నారు. దేశానికి చమురు అందించే హార్ముజ్ జలసంధిని ఇరాన్, అమెరికా మూసేసిన నేపథ్యంలో చమురు రవాణా జరగకుండా, సంక్షోభం తలెత్తింది. మరోవైపు దేశంలో చమురును పొదుపుగా వాడాలని ప్రధాని మోదీ ఇటీవల ప్రజలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# హైదరాబాద్‌లో ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు. పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశం లోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# 15న ఆధారాలతో విచారణకు వస్తా...

**తొలి అక్షరం/హైదరాబాద్,మే 13:** పేట్ బషీరాబాద్ పోలీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ ఓ లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో మే 15వ తేదీన విచారణకు హాజరవుతానని తన లేఖలో పేర్కొన్నారు. సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ తెలిపారు.

ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. బండి భగీరథ పంపిన లేఖ ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 15న జరగనున్న విచారణలో ఆయన సమర్పించే ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే భగీరథ బెయిల్ కేసులో గురువారం 14న హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది.

# క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఆయన నాయకత్వంలో ఇప్పుడు తెలంగాణ మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో కూడా టాప్‌లో ఉంది.' అని ట్విట్టర్ (ఎక్స్)లో కేటీఆర్ పేర్కొన్నారు. వెల్‌డన్ రాహుల్ గాంధీ.. నిజంగానే తెలంగాణ రైజింగ్ అంటూ కాంగ్రెస్ నాయకత్వాన్ని వ్యంగ్యంగా అభినందించారు.

# పొదుపు సూత్రాలు తెలంగాణకు... నిధులు మాత్రం ఆంధ్రాకా ..?

(మొదటి పేజీ తరువాయి)

తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్టును 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# బండి భగీరథ్ అరెస్ట్ తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు. మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# విద్యారంగ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైంది: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**తొలి అక్షరం/మహబూబాబాద్, బ్యూరో మే.13:** విద్యారంగ అభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర కీలకమైందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతీ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని జెడ్ పి హెచ్ ఎస్ కురవి పాఠశాల యందు నిర్వహించిన కురవి, సిరోలు మండల సర్పంచుల ఒకరోజు ప్రత్యేక శిక్షణ (ఓరియెంటేషన్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిప్రత్యేకించి విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ పాఠశాల బలోపేతమే గ్రామాభివృద్ధికి పునాది” అని స్పష్టం చేశారు. విద్యను ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రతి గ్రామంలో పాఠశాలల అభివృద్ధి పనులకు సర్పంచులు ముందుండాలని అన్నారు.విద్యార్థుల హాజరు, శుభ్రత, భద్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులపై గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.డ్రాప్‌అవుట్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సర్పంచుల తక్షణ లక్ష్యం కావాలని



అన్నారు. గ్రామం కలిసి ముందుకు తీసుకెళ్లే సమిష్టి బాధ్యతగా పేర్కొన్నారు. తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇటీవలి పాఠశాల సందర్శనల్లో చూసిన మంచి పద్ధతులను పంచుకున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ , స్మార్ట్ టీచింగ్, స్వచ్ఛత పట్ల విద్యార్థుల్లో పెరుగుతున్న అవగాహన వంటి అంశాలను ప్రశంసించారు. అన్ని గ్రామాల్లో ఇలాంటి మోడల్ స్కూల్స్ నిర్మించేందుకు సర్పంచులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు.ఉపాధ్యాయులు, గ్రామసర్పంచులు, పాఠశాల కమిటీలు, విద్యాశాఖ అధికారుల మధ్య సమన్వయం పెంపు ద్వారా మాత్రమే నాణ్యమైన విద్యను అందించగలమని కలెక్టర్ స్పష్టంగా చెప్పారు.క్షేత్రస్థాయిలో సర్పంచులు అన్ని అంశాలపై దృష్టి పెట్టాలని యువత డ్రగ్స్ నివారణ చర్యలు, రోడ్డు భద్రత కార్యక్రమాలు, బాల్య వివాహాలు నివారణ చర్యలు తదితరులు విషయాల పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆల్వాల సత్యనారాయణమూర్తి, మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, ఇస్లావత్ లచ్చిరాం నాయక్, ఏ సి జి ఈ మందుల శ్రీరాములు. ఎఫ్ ఏ ఓ బానోత్ శంకర్ నాయక్, సీఎంఓ వంగ సురేష్, ఏ ఎస్ సి సంతోష్ ఎంపీడీవో,లు వీరబాబు, మహమ్మద్ గౌస్ పాషా స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎండి వహీద్.ఆర్పీలు ప్రవీణ్, శివప్రసాద్, లింగమూర్తి , ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**• టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే13:** తొర్రూరు వంటి ప్రాంతాలలో అందుబాటులో ఉన్న కార్పొరేట్ స్థాయి లాంటి నాణ్యమైన వైద్య సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి కోరారు.తొర్రూరు పట్టణ కేంద్రంలోని రామకృష్ణ థియేటర్ ఎదురుగా మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను బుధవారం స్థానిక హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మహేష్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని,తొర్రూరు డివిజన్ చుట్టూ పరిసరాల ప్రాంత ప్రజలు సుధీర ప్రాంతాలకు వెళ్లకుండా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అందుబాటులో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు,వైద్య సేవలు పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు.పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ఈ హాస్పిటల్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,కాంగ్రెస్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి,జక్కా మహబూబ్ రెడ్డి, వెంకన్న యాదవ్, మహేష్ యాదవ్, కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన ఝాన్సీ రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే13:** తొర్రురు పట్టణంలోని బీఆర్ గార్డెన్ లో బుధవారం నిర్వహించిన తొర్రూరు మాజీ సర్పంచ్ లు,మున్సిపల్ 6వ కౌన్సిలర్ పెదగాని కళావతి సోమయ్య కుమార్తె కళ్యాణి– సందీప్ ల వివాహ మహోత్సవ వేడుకలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సి రాజేందర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో సాన్నిహిత్యంగా ముచ్చటిస్తూ, ఈ శుభకార్యం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,సీనియర్ నాయకులు జాటోత్ నెహ్రూ నాయక్, గంజి విజయపాల్ రెడ్డి,పింగిలి ఉష, అనిత బాపురెడ్డి, దొంగరి రేవతి శంకర్,వెంకన్న యాదవ్,రాజేష్ యాదవ్, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

**- అసత్య ప్రచారాలు చేయవద్దు**

**- ప్రతిఒక్కరికి చట్టలపై అవగాహన కలిగి ఉండాలి: ఎస్పీ డా. శబరీష్**

**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని, అసత్య ప్రచారాలు చేయవద్దని జిల్లా ఎస్పీ వైద్యులు శబరిష్ సూచించారు.బక్రీద్ పండుగ సందర్భంగా గో రక్షకులు, హిందూ సంఘాల ప్రతినిధులతో బుధవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లా డుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు ప్రచారం చేసి శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి సంఘటన జరిగినా పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా తొందరపడి ఆందోళనలు,




ఉద్రిక్తతలు సృష్టించవద్దని సూచించారు.ప్రతి ఒక్కరూ Prevention of Cruelty to Animals Act, Animal Transportation Rules, Prohibition of animal Slaughter Act తదితర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జంతువుల అక్రమ రవాణా, అనుమతి లేని వధ, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా 6 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు పోలీస్ నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.పండుగ సమయంలో పరస్పర గౌరవ



భావనతో వ్యవహరించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని, యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు:. కంట్రోల్ రూమ్ – 8712656999జిల్లా ఎస్పీ 8712656900డీఎస్పీ మహబూబాబాద్ 8712656904డీఎస్పీ తొర్రూరు 8712656905 డయల్ 100జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, గో రక్షకులు, హిందూ సంఘాల ప్రతినిధులు డిఎస్పీ తిరుపతి రావు, కృష్ణ కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

# అంపాల పద్మారెడ్డి సేవలు చిరస్మరణీయం

**• నాచారంలో ఘనంగా తొలి వర్ధంతి కార్యక్రమం**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మే13:** నాచారం డివిజన్ బిజెపి అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో, సీనియర్ నాయకుడు ప్రకాష్ అధ్యక్షతన నాచారం అను ఫర్నిచర్ వద్ద బిజెపి సీనియర్ నాయకుడు స్వర్గీయ అంపాల పద్మారెడ్డి తొలి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పద్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ.. అంపాల పద్మారెడ్డి అజాత శత్రువని, చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండేవారని గుర్తుచేశారు. అలాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్ రావు, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, బెక్కరి రవీందర్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, మంకేనా శ్రీనివాస్ రెడ్డి, చంద్రమౌళి, రవికాంత్, దయగౌడ్, అభిషేక్ గౌడ్, పాదం వెంకటేశ్వర్లు, ఉదయ్ కిరణ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,నవీన్ రెడ్డి, ఆనంద్ గుప్తా, రాజిరెడ్డి, జ్యోతి రెడ్డి, మంజువాణి, వరలక్ష్మి తదితరులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు లో వెన్నం శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర..

**మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రశంసలు..**

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం..**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాట్లు వెన్నం శ్రీకాంత్ రెడ్డి పాత్ర కీలకమైందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి లు ప్రససించారు. బుధవారంజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం తగిన గుర్తింపు ఇస్తోందని తెలిపారు.వెన్నం శ్రీకాంత్ రెడ్డి పార్టీ బలోపేతం కోసం గ్రామస్థాయి నుంచి పనిచేస్తూ కార్యకర్తలను సమన్వయం చేశారని, ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలకు విద్యా, విజ్ఞాన సేవలు అందించే గ్రంథాలయ వ్యవస్థ అభివృద్ధికి శ్రీకాంత్ రెడ్డి కృషి చేస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠా నానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి, యువతలో పఠనాసక్తి పెంపొందిం చేందుకు కృషి చేస్తానని అన్నారు. మానుకోట లో నయాజోష్... ప్రమాణస్వీకారం చేయించిన గ్రంథాల రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్. ఎంపీ బలరాం నాయక్, , ఎమ్మెల్యే మురళీ నాయక్,, డిసిసి అధ్యక్షులు ఉమా మురళీ నాయక్ , ,రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కార్య దర్శి ఝాన్సీ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,మాజీ డిసిసి అధ్యక్షుడు భరత్ బాబు, సీపీఐ. జిల్లా కార్యదర్శి విజయ్ సారధి, అజయ్ సారధి , సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్ రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యులు రాధా, మున్సిపల్ చైర్మన్ జ్యోతి ,మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుధాకర్ ,వైస్ చైర్మన్ మదన్ లోయ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాం రెడ్డి, జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలత ,యూత్ అధ్యక్షుడు సురేష్,బాలు చౌహాన్ ,వార్డు కౌన్సిలర్ అరుణ, వివిధ వార్డు కౌన్సిలర్ లు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మిల్లర్ల దోపిడిని అరికడదాం

- మండల వ్యాప్తంగా ఉన్న రైతులు ఏకం కావాలి
- ఆవుల లక్ష్మీనారాయణ యువరైతు నిర్ణంల



**తొలి అక్షరం/రామన్నపేట మే 13:** రామన్నపేట మండల వ్యాప్తంగా 24 గ్రామపంచా యతీలు ఉన్నాయి 31 వడ్ల కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. రామన్నపేట మండలంలో ఉన్న మిల్లర్ల యాజమాన్యాల దోపిడీని అరికట్టడం కోసం మండల వ్యాప్తంగా ఉన్న యువ రైతులు రైతులు కౌలుదారు రైతులు ఏకమై పోరాటం చేద్దాం రండి కదలి రండి. ఇది ఒక్కరి సమస్య కాదు ఇది అందరి సమస్య. వ్యవసాయ అధికారి ధ్రువీకరించిన వడ్లను మాత్రమే కొనుగోలు చేసి ఆరుకాలం కష్టం చేసి ఎండనక వాననక పురుగనక పాము అనక ఎండకు ఓర్చి వానకు తడిచి కష్టపడి పంటను పండిస్తే క్వింటాలుకు మూడు కిలోల నుంచి 5 కిలోల దోపిడిని అరికట్టడానికి మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పార్టీలను పక్కకు పెట్టి పోరాటం చేద్దాం కదలిరండి. వాస్తవానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం 40 కిలోలు మాత్రమే తూకం వేయాలి. వివిధ రకాల కుంటి సాకుతో 40 కిలోల 500 గ్రాములు తూకం వేయడం జరుగుతుంది కానీ రామన్నపేట మండలంలో ఉన్న రైస్ మిల్లు ఓనర్లు రైతుల రక్తం తాగడానికి ముందుకు వచ్చారు. మాకు గోదాముల్లో ఫుల్ స్టాక్ ఉన్నాయి అని మీ ఒడ్లు మాకు ఎందుకు అవసరం లేదు అని వివిధ రకాల కుంటి సాకుతో 41 కిలోల 500 గ్రాములు తూకం మాత్రమే తీసుకుంటామని అధికారుల సమక్షం లో రైతులను బ్లాక్ మెయిల్ చేస్తూ అయినా సరే రైతు తన పెట్టుబడి అయిన రావాలి అని ఉద్దేశంతో మిల్లర్ల కండిషన్కు ఒప్పుకొని లారీ నింపి పంపిస్తే అక్కడికి పోయినంక ఇవి పొట్టి వడ్లు ఇవి పొడుగు వడ్లు ఇవి తాలువడ్లు ఇవి నూక లు అని కుంటి సాకులు చెబుతూ అదనంగా కిలో అక్కడ కట్ చేయడం రైతును నిండా ముంచడానికి నిదర్శనంగా మారుతు న్నారు. పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చాలో కౌలు కోసం తెచ్చిన అప్పులు తీర్చాలో అప్పు లకు మిత్తిలు కట్టాలో అర్థం కాక రైతులు మిల్లర్ల దోపి డీకి అల్లాడు తున్నారు రండి కదలి రండి పోరాటం చే ద్దాం అని యువ రైతు ఆవుల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు.

## అంబేద్కర్ విగ్రహానికి, అమరవీరులకు నివాళులర్పించిన వెన్నం





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి, అమరవీరులకు వెన్నం శ్రీకాంత్ రెడ్డి నివాళులు అర్పించారు. జిల్లా గ్రంధాలయ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా బుధవారం ప్రమాణ స్వీకారానికి ముందు జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట గల అంబేద్కర్ విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ముత్యాలమ్మ గుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకుని జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. దేశానికి అంబేద్కర్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తదుపరి అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను స్మరించుకుంటూ వారికి గౌరవ వందనం చేసి,ముత్యాలమ్మ కు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో మా అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం, అంబెడ్కర్ సంఘం అధ్యక్షుడు కామ సంజీవ రావు, పాల బిందెల మల్లయ్య ,అడ్వకేట్స్ వడ్లకొండ సుభాష్.,రాజేందర్,గొడుగు శ్రీనివాస్, బాలు నాయక్ ,పుల్లయ్య ,ఇనుగుర్తి సుధాకర్ ,మందుల రఘు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


- ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: జిల్లా ఎస్పీ శబరిష్



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** విధుల పట్ల అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణముగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశించారు. బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ శబరిష్ కురవి చెక్‌పోస్ట్‌ను అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలి ంచారు. ఇందులో భాగంగా కురవి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అక్రమ పశువుల రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ అరికట్టాలని, చెక్‌పోస్ట్ ద్వారా వెళ్లే ప్రతి వాహనాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు. పశువులను తరలిస్తున్న వాహనాలకు సంబంధించి అవసరమైన పత్రాలను పరిశీలిస్తూ, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని, షిఫ్ట్ విధానంలో సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు. తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులు లేదా పారిపోయే వాహనాల సమాచారాన్ని వెంటనే ఉన్నతా ధికారులకు అందించాలని సూచిం చారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.



## ప్రయివేటు స్కూళ్లు అనుమతుల మేరకే తరగతులు నిర్వహించాలి: ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి



**తొలి అక్షరం /మేడిపల్లి/మే 13:** మేడిపల్లి మండలంలోని ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతుల మేరకు తరగతులను నిర్వహించాలని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గడువు ముగిసి అనుమతులు ఉన్న పాఠశాలలు నిబంధనల ప్రకారం వెంటనే పునరుద్ధరణ పొందాలని సూచించారు. అనుమతులు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చే, లేదా చదివిస్తున్న పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వ అనుమతుల వివరాలను తెలుసుకొని అన్ని చట్టబద్ధంగా ఉన్న పాఠశాలలలోనే చదివించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ పాఠశాల యాజమాన్యం తమ అనుమతుల వివరాలు, వాటి చెల్లుబాటు తేదీలను పాఠశాల నోటీసు బోర్డులో యూడీఐఎస్ఈ కోడ్తో సహా స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు.

## సేవే ధ్యేయంగా... చిన్నారులకు మామిడి పండ్ల వితరణ చేసిన పోలీస్ కానిస్టేబుల్ పెండెం వెంకన్న

- నివాన్షి పెడం ఆధ్వర్యంలో సమ్మర్ ప్రత్యేక శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు అల్పాహారం
- విధి నిర్వహణతో పాటు సామాజిక సేవలోనూ ఆదర్శంగా నిలిచిన అయ్యగారిపెల్లి రైతు



**తొలి అక్షరం/ఇనుగుర్తి మే13:** ఇనుగుర్తి మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో నివాన్షి పెడం ఆధ్వర్యంలో గ్రామ విద్యాభివృద్ధి కమిటీ నిర్వహిస్తున్న సమ్మర్ ప్రత్యేక శిక్షణ కేంద్రానికి హాజరైన బాలబాలికలకు ఆదర్శ రైతు, పోలీస్ కానిస్టేబుల్ శ్రీ పెండెం వెంకన్న మామిడి పండ్లను అల్పాహారంగా పంపిణీ చేశారు. ఇద్దరు ట్యూటర్ల బోధన అనంతరం చిన్నారులకు ఈ ప్రత్యేక అల్పాహారం అందజేయడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అయ్యగారిపెల్లి గ్రామానికి చెందిన శ్రీ పెండెం వెంకన్న నిత్యం పోలీస్ విధుల్లో ప్రజల రక్షణ బాధ్యతలు నిర్వహిస్తూనే, సామాజిక సేవలోనూ ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తాను స్వయంగా పెంచి, సంరక్షించిన మామిడి తోటలో పండిన మామిడి కాయలను విద్యార్థులకు అందించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ (ప్రధానోపాధ్యాయురాలు) జంగా రూపారాణి, గ్రామ విద్యాభివృద్ధి కమిటీ పెద్దలు విద్యాపురం నాగేశ్వరరావు, ఛైర్మన్ దార్ల రామ్మూర్తి, ఇద్దరు ఆయాలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలందరూ శ్రీ పెండెం వెంకన్న గారి సేవా భావాన్ని అభినందిస్తూ ప్రశంసలు కురిపించారు.

# వెల్ జర్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం

- కీర్తిశేషులు వెంకటమ్మ మరియు వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం
- మేక రఘునందన్ రెడ్డి ఆధ్వర్యంలో సాధురం కంటి దవాఖాన మరియు ఐకేర్ విజన్ ఫౌండేషన్ వారి సహకారంతో
- గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోండి సర్పంచ్ ఆర్ బాబు నాయక్





**తొలి అక్షరం/షాద్ నగర్, మే 13:** వెల్‌జర్ల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరం కీర్తిశేషులు వెంకటమ్మ మరియు వెంకటరెడ్డి గారి జ్ఞాపకార్థంతో వారి కుమారుడు మేక రఘునందన్ రెడ్డి మరియు కుటుంబ సభ్యుల సహకారంతో అదే విధంగా గ్రామపంచాయతీ వారి సహకారంతో నిర్వహించడం జరిగింది. ఈ యొక్క క్యాంపును మదర్ తెరిసా సేవారత్న నేషనల్ అవార్డు విన్నర్ శ్రీ డాక్టర్ మధుసూదన్ రెడ్డి గారు మరియు గోల్డెన్ జూబ్లీ లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సాధురం కంటి దావఖానా వారి ఆధ్వర్యంలో ఈ క్యాంపు నిర్వహించి ఇక్కడ ఉచిత కంటి పరీక్షలు మరియు కంటి శాస్త్ర చికిత్స పరీక్షలు, జనరల్ చెకప్ మరియు ఎలక్ట్రో కార్డియోగ్రామ్ నిర్వహించడం జరిగింది. అదేవిధంగా ఈ క్యాంపులో ఎవరికి అయితే కంటికి సంబంధించినటువంటి ఆపరేషన్ వారికి అవసరం అయితదో వారే స్వయానా సొంత ఖర్చులతో ఆపరేషన్ ఖర్చులు ఈ క్యాంపు ద్వారా గుర్తించి ఆసుపత్రిలో వైద్య సదుపాయాలు అందించడానికి నిర్ణయం తీసుకున్నారు. కనుక ఈ యొక్క క్యాంపును నిర్వహించినం దుకు గ్రామపంచాయతీ ద్వారా గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ మాట్లాడుతూ ఈ యొక్క క్యాంపుకు మా గ్రామంలో నిర్వహించినందుకు మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ మీకు మీ కుటుంబానికి గ్రామపంచాయతీ పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలుపుతూ మీ సహాయ సహకారాలు గ్రామానికి ఎల్లప్పుడూ ఉండాలని ఆయన వెల్లడించారు. డిప్యూటీ సర్పంచ్ వెంకటేష్ యాదవ్ మరియు గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు గ్రామ పెద్దలు గ్రామ యువకులు అదేవిధంగా ఈ క్యాంపుకు వచ్చినటువంటి స్టాఫ్ నర్సులు దివ్య, జలజ, మంజుల మరియు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వెలికట్టలో వైభవంగా చరణ్ హిమయ వివాహ మహోత్సవం

- ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ హాజరు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 13:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం వెలికట్ట గ్రామంలో చి॥ చరణ్, చి॥ల॥సౌ॥ హిమయ (మరియ)ల వివాహ వేడుక అత్యంత వైభవంగా, ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను మనసారా ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో మాజీ నెల్లికుదురు ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు బత్తిని అనిల్, ఎర్రబెల్లి గూడెం ఎంపీటీసీ, బి.ఆర్.ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు గజ్జి అశోక్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువ నాయకులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖుల రాకతో కళ్యాణ వేదిక సందడిగా మారగా, వడ్లకొండ మరియు గాడె కుటుంబ సభ్యులు అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఈ వివాహ మహోత్సవానికి బంధుమిత్రులు, గ్రామస్థులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ శుభకార్యం ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగి అందరినీ ఆకట్టుకుంది.

# శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, నూతన దేవాలయ ప్రారంభోత్సవం

- పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి, మాజీ మంత్రులు మహమూద్ ఆలీ,శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్,జైపాల్ యాదవ్,నరేందర్ రెడ్డి

**తొలి అక్షరం/షాద్ నగర్, మే 13:** నందిగామ మండలం చెగూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మరియు నూతన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు గారితో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ ఆలీ,శ్రీనివాస్ గౌడ్ మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్,జైపాల్ యాదవ్,నరేందర్ రెడ్డి,మాజీ చేగూర్ మాజీ సర్పంచ్ మామిళ సంతోష విట్టల్,బీఆర్ఎస్ నాయకులు సత్య నారాయణ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# స్వామి భక్తికి.. అజయశక్తికి.. నిదర్శనం ఆంజనేయుడు..

**ఆయన మార్గం అందరికీ ఆదర్శం కావాలి: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**నందిగామ మండలం చేగూరు గ్రామంలో భారీ ఎత్తున శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట..**

**మాజీ ఎంపీపీలు శివ శంకర్ గౌడ్, ప్రియాంక గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు..**

**భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు, ప్రముఖులు**








**తొలి అక్షరం/షాద్ నగర్, మే 13:** స్వామి భక్తికి.. అజయ శక్తికి.. అద్వితీయమైన సాహసాలకు ప్రతీక ఆంజనేయ స్వామి అని, ఆయన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం చేగూరు గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మాజీ ఎంపీపీలు శివశంకర్ గౌడ్, ప్రియాంక గౌడ్ ల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విగ్రహ ప్రతిష్టాపన, ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గ్రామంలో మంచి నాయకత్వం ఉందని, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాలుపంచుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ గ్రామం ఆధ్యాత్మిక క్షేత్రం గా వెలుగొందాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి పైన ఆంజనేయస్వామి దయ ఉండాలని ఆ స్వామిని వేడుకున్నానని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని, దైవకార్యాలు, మంచి కార్యాలు చేసేటప్పుడు కలిసిమెలిసి పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఇంతటి చక్కని ఆధ్యాత్మిక కార్యక్రమానికి తనకు ఆహ్వానం పలకడం, తాను రావడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను పెంచే ఆలయాలకు, ప్రార్థన ఆలయాలకు మతాలకు అతీతంగా పూర్తిస్థాయిలో సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టిన కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్ లను ఆయన అభినందించారు.

**ఆధ్యాత్మికం.. అత్యద్భుతం..** శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంతో చేగూరు గ్రామంలో ఒక్కసారిగా అత్యద్భుతమైన ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. దంపతులైన కొత్తూరు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, నందిగామ మాజీ ఎంపీపీ ప్రియాంక గౌడ్ లు అన్ని తామై ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. భారీ ఎత్తున చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులందరికీ కావాల్సిన సదుపాయాలను ఈ దంపతులు సమకూర్చడం విశేషం. ఇంత మంచి ఆధ్యాత్మిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టడమే కాకుండా గ్రామానికి రాజకీయ ప్రముఖులను పార్టీలకు అతీతంగా ఆహ్వానించి అందరి మన్ననలు పొందారు. ఆధ్యాత్మికంగా గ్రామంలో ఎంత మంచి కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఒక్కరి అభినందనలు అందుకున్నారు.


**అందరికీ కృతజ్ఞతలు.. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్** ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా గ్రామంలో ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి తరలివచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్ తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో రాజకీయాలకు ఆస్కారం ఉండదని, తాము ఆహ్వానించినట్లుగానే ప్రతి ఒక్కరూ తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందని శివ శంకర్ గౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉపసర్పంచ్ ఆవుల శివశంకర్, వార్డు సభ్యులు భాస్కర్ గౌడ్, సోలిపేట శ్రీనివాస్, మనక సురేష్, కావలి భీమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ చారి, సర్పంచులు బుగ్గ సాలయ్య, గొల్లపల్లి అశోక్, కొమ్ము కృష్ణ, మల్లేష్, పబ్బయి శ్రీశైలం, మాజీ సర్పంచ్ వీరేందర్ గౌడ్, కావలి కృష్ణ, సతీష్ పటేల్, మాజీ ఎంపీపీ కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య



**తొలి అక్షరం/షాద్ నగర్, మే 13:** చేగూరులో శ్రీ విరాంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్థంభం, శివలింగం, గణపతి, నవగ్రహాలు మరియు విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఈరోజు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి , అందే బాబయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అశోక్ గౌడ్, నర్సింహగౌడ్, రాజు, సత్యం తదితర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. శ్రీ విరాంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగింది.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్






**తొలి అక్షరం/రామన్నపేట మే 13:** రామన్నపేట మండలం లివెల్లంకి గ్రామానికి చెందిన లికాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు కీరబోయిన మధులివివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినరు.రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుండాల నరసింహ గౌడ్ కుమారుడు గుండాల నవీన్ గౌడ్ (ఎస్సై) వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారుసూరారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంజి రాజు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినారుఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి రాష్ట్ర నాయకులువనం చంద్రశేఖర్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు దొమ్మాటి లింగ రెడ్డి తాటిపాముల జంగయ్య, సూరారం ఉపసర్పంచ్ సంక బుడ్డి. సైదులు అరవింద్ ,నరసింహ, రమేష్, వెంకటేష్, సత్తిరెడ్డి, అచ్చాలు, తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**తొలి అక్షరం/రామన్నపేట మే 13:** రామన్నపేట మండల కేంద్రంలో లక్ష్మాపురం గ్రామానికి చెందిన బత్తుల యాదయ్య కుమార్తె వివాహము పట్టణ కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్లో జరగగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం సర్పంచులు పులిపలుపుల సునీత వీరస్వామి గర్దాస్ విక్రమ్ మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం ఎండి ఆమీర్ మాజీ యూత్ మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న ఉప సర్పంచులు నీల నరసింహ చొప్పరి నరసింహ మాజీ ఉపసర్పంచులు బత్తిని మహేష్ గండికోట ఆంజనేయులు నాయకులు బొలుగుల కృష్ణ బొడ్డుపల్లి రాజు అనంత చారి జోగుల సత్యనారాయణ స్వామి సైదులు వెంకట్ రెడ్డి అశోక్ మల్లేశం శ్రీను తదితరులు పాల్గొనడం జరిగింది

## శుభాకాంక్షలు తెలిపిన చిరుమర్తి



**తొలి అక్షరం/రామన్నపేట మే 13:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం లో జరిగిన బోదాస్ ఐలయ్య కూతురు నిశ్చితార్థం లో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వధించి శుభాకాంక్షలు తెలియచేసిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి,వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి,కుంచం రమేష్, ఈర్లపల్లి మల్లయ్య, కుంచం శ్రీను,బోదాస్ నరేష్, పల్లపు లింగం, కుంచం మురళి,వరికుప్పల నర్సింహా, బోదాస్ నరేష్, బోదాస్ రాజు,వరికుప్పల రవి, భోదాస్ రవిందర్, వరికుప్పల వెంకటేష్,వరికుప్పల పాండు, వరికుప్పల శ్రీకాంత్, వరికుప్పల రమేష్,గర్ధాస్ కరుణాకర్ మాజీ ఏఎంసి డైరెక్టర్, గర్ధాస్ శ్రీకాంత్, గడ్డం సాయి, గర్ధాస్ సాయి,తదితరులు పాల్గొన్నారు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలకు ఘన ప్రారంభం

**జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారులు**

**ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళు లర్పించిన ప్రజాప్రతినిధులు**




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ మే 13:** నెల్లికుదురు మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ రాందాస్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యా అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పలువురు అభిప్రాయపడ్డారు. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

## అరవింద్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి సీతక్క రాజ్యసభ వేం







**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** అరవింద్ ఆసుపత్రిని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటిపారుదల శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయకులు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి బజార్లో అధునాత అంగులతో నూతనంగా నిర్మించిన అరవింద్ చిన్నపిల్లల ఆస్పత్రిని వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ ఘణపురపు అంజయ్య సుభాసినిల దంపతులు వారిని పూలమాలతో శాలువాలతో ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ , మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్, సినీ హీరో సత్య దేవ్ ,జన్సీ హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి రమేష్ మాట్లాడుతూ, "వైద్యుడు దేవుడితో సమానం. పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించాలి. మహబూబాబాద్ ప్రజలు పెద్ద పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన చికిత్స పొందే విధంగా ఆసుపత్రి యాజమాన్యం సేవలు అందించాలని కోరుతున్నాను" అని తెలిపారు. అలాగే ప్రజల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి మూలం అని పేర్కొంటూ, సేవాభావంతో పనిచేసే వైద్యులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు.అరవింద్ ఆసుపత్రి ప్రారంభంతో మహబూబాబాద్ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ ఆసుపత్రి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆశాకిరణంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీల వ్యవస్థ బలోపేతానికి అధిక నిధుల మంజూరు చేస్తూ నిరంతరం అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది

**● గ్రామాల్లో త్రాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: మంత్రి సీతక్క ● మక్కలు, దాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి ● కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి ● ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి**









**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మే 13:** గ్రామ పంచాయతీల వ్యవస్థ బలోపితానికి నిధులు విడుదల చేస్తూ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ నీటిపారుదల, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి పనుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు, మహబూబాబాద్ ఎం.పి పోరిక బలరాం నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో అత్యంత అధిక ప్రాధాన్యతగా త్రాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగాలని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందున పద్దుల వారీగా ఖర్చులు చేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ధాన్యం మొక్కజొన్న ల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తుందని నిత్యం గ్రామాలు పట్టణాల పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు,కొంతమంది అభివృద్ధి పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని అట్టివారిని సహించేది లేదన్నారు, రానున్న వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నూతన లైన్లు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు.ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే జూన్ మాసంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, ఉద్యానవన శాఖ యూనివర్సిటీ, జెఎన్టియు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, మున్సిపల్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచి ప్రారంభోత్సవం శంకుస్థాపనలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు,గత సీజన్ తో పోల్చుకుంటే ఈ సీజన్లో మరి ధాన్యం, మొక్కజొన్నల దిగుబడి అధికంగా ఉన్నందున అందుకు తగిన విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని హమాలీలను లారీలను, ట్రాక్టర్స్, డీసీఎం, తదితర సదుపాయాల ద్వారా ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేసి వెంట వెంటనే తరలించాలని సూచించారు.పంట మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కల్పించాలని ధాన్యంతో పాటు ఇతర వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహించాలని తద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని కోతుల బెడద కూడా లేకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలోని ఐదు మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధి కోసం సుమారు 150 నుండి 200 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఉంటూ ఉండాలని సూచించారు.జిల్లాలో కొంతమంది నిరుపేదలు అటవీ భూములు, పోడు భూముల సమస్యలు ఉన్నందున అర్హులైన నిరుపేదలు అట్టి భూములలో నివాస స్థలాలు ఏర్పరచుకొని ఉన్నారని వారిని అటవీశాఖ అధికారులు కొంత ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, పేద ప్రజల ను ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు,మక్కలు,ధాన్యం కొనుగోళ్లలో కొంతమంది కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అందుకు అధికారులు వారు చేస్తున్న పనుల వివరాలను వెంటవెంటనే తెలియపరచాలని సూచించారు,జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎవరైనా కబ్జాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు సూచించారు,ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం కోసం ముందస్తు చర్యలు తీసుకొని సాగాలన్నారు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల పనితీరులలో పారదర్శకంగా వ్యవహరించి నిధులను సక్రమంగా వినియోగించే విధంగా పంచాయతీరాజ్ డిపిఓ చర్యలు తీసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని తెలిపారు.మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మక్కలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లాలో తక్కువ శాతం కొనుగోలు అయిందని తెలిపారు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం నిల్వల కోసం గోదాములను పరిశీలించాలని, ధాన్యాన్ని తరలించడం కోసం వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా నియమించుకోవాలని సూచించారు.సమావేశానికి హాజరైన మంత్రి, రాజ్యసభ సభ్యులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు మక్కలు, దాన్యం కొనుగోళ్ల, అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు నిర్వహణ తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ కార్యాలయ) నిర్మాణం వివరాలను కోరగా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ ఇప్పటికే దాదాపుగా పూర్తయిన కార్యాలయ పనులలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకొని సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు.అనంతరం వారు చెప్పిన సూచనలు సలహాలు స్వీకరించుకుని సంబంధిత అధికారులకు జారీ చేసి ప్రత్యక్షంగా స్వయంగా పనులు సమస్యల పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఫారెస్ట్ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ రెడ్డి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, డోర్నకల్, మరిపెడ తొర్రూరు, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్లు , వైస్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

---

# అప్రమత్తతే ఆయుధం.. క్షణాల్లో స్పందిస్తేనే సొమ్ము భద్రం




**- బాగాయత్ అవగాహన సదస్సులో ఎస్హెచ్ఓ రామలింగారెడ్డి హెచ్చరిక**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),మే13:** అత్యాశకు పోయి అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేస్తే కష్టార్జితం సైబర్ నేరగాళ్ల పాలవుతుందని ఉప్పల్ ఎస్హెచ్ఓ వై.రామలింగారెడ్డి హెచ్చరించారు.బుధవారం ఉప్పల్ బాగాయత్‌లోని కాలభైరవ ఆలయ ప్రాంగణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న సరికొత్త పద్ధతులు, వాటిని తిప్పికొట్టే మార్గాలపై ప్రజలకు దిశానిర్దేశం చేశారు.

### సాంకేతిక మోసాలపై నిశిత విశ్లేషణ:

సదస్సులో ఎస్హెచ్ఓ మాట్లాడుతూ..డిజిటల్ అరెస్టులు, కేవైసీ అప్‌డేట్, అధిక లాభాల ఆశచూపే పెట్టుబడి పథకాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు నిశితంగా వ్యవహరించాలని సూచించారు.ఏ ప్రభుత్వ సంస్థ లేదా బ్యాంక్ అధికారులు ఫోన్ ద్వారా మీ వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు అడగరు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే కట్ చేయాలి అని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల విధుల్లో భాగంగా ప్రజల భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### గోల్డెన్ అవర్ ప్రాధాన్యత: ఎస్సై మాధవరెడ్డి

అనంతరం ఎస్సై మాధవరెడ్డి మాట్లాడుతూ..సైబర్ మోసానికి గురైన బాధితులకు 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని వివరించారు.నగదు పోగొట్టుకున్న వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా నిందితుల ఖాతాలను స్తంభింపజేసి నగదును తిరిగి పొందే అవకాశం ఉంటుందని సాంకేతిక వివరాలతో సహా వివరించారు.తమ కాలనీలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పోలీసులు స్వయంగా వచ్చి అవగాహన కల్పించడంపై బాగాయత్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతగా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్హెచ్ఓ రామలింగారెడ్డి బృందాన్ని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రముఖులు,యువత పాల్గొన్నారు.

---

# దేశ ప్రయోజనమే పరమావధి

**● విమర్శల కంటే బాధ్యతే మిన్న ● సంక్షోభ సమయాల్లో దేశానికి అండగా నిలుద్దాం ● పొదుపు,క్రమశిక్షణే రేపటి భారతావనికి పునాదులు ● ఎల్పీజీ జాతీయ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),మే13:** దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పుడు కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైందని ఎల్పీజీ జాతీయ అధ్యక్షులు సామాజిక విశ్లేషకులు పింగళి వెంకటేశ్వర రావు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ సంక్షోభాలు, ఇంధన ధరల పెరుగుదల వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

### అంతర్జాతీయ ప్రభావం - వాస్తవ పరిస్థితి:

భారతదేశం తన ఇంధన అవసరాల కోసం 85 శాతం ముడి చమురును విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులో ఏర్పడిన అంతరాయాల వల్ల చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.డాలర్ విలువ పెరగడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై అదనపు భారాన్ని మోపుతోంది.ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో పరిమితమైన సమస్య కాదని, దశాబ్దాలుగా ఉన్న నిర్మాణాత్మక పరిస్థితి అని పింగళి వెంకటేశ్వర రావు గుర్తు చేస్తున్నారు.

### దూరదృష్టితో ప్రభుత్వ అడుగులు:

కేంద్ర ప్రభుత్వం కేవలం పన్నుల వసూలుకే పరిమితం కాకుండా ఆ ఆదాయాన్ని దేశాభివృద్ధికి,సంక్షేమానికి మళ్లిస్తోంది.

### మౌలిక సదుపాయాలు:

జాతీయ రహదారులు, రైల్వే ఆధునీకరణ, డిజిటల్ నెట్‌వర్క్ విస్తరణ.

### సంక్షేమ పథకాలు:

కోట్లాది మందికి ఉచిత రేషన్, కరోనా వ్యాక్సినేషన్ వంటి భారీ కార్యక్రమాలు ఈ ఆదాయం వల్లే సాధ్యమయ్యాయి.

### భవిష్యత్ వ్యూహాలు:

విదేశీ ఇంధన భారాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్, ఎథనాల్ మిశ్రమ ఇంధనం,సౌరశక్తి రంగాల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందనీ పివి రావు అన్నారు.

### నాడు జై జవాన్.. నేడు పొదుపు:

గతంలో దేశ నాయకులు ఇచ్చిన జై జవాన్ జై కిసాన్ నినాదం ప్రజలను ఎలాగైతే ఉత్తేజపరిచిందో, ప్రస్తుత ఇంధన పొదుపు పిలుపును కూడా అదే స్ఫూర్తితో స్వీకరించాలని నిపుణులు సూచిస్తున్నారు. అనవసర ప్రయాణాలు తగ్గించడం, విద్యుత్,గ్యాస్‌ను పొదుపుగా వాడటం దేశ ఆర్థిక భద్రతలో కీలక భాగమని ఆయన గుర్తు చేస్తున్నారు.దేశం బలంగా ఉంటేనే ప్రతి కుటుంబం భద్రంగా ఉంటుంది.సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడితే, లోపల ప్రజలు ఆర్థిక క్రమశిక్షణతో దేశాన్ని బలోపేతం చేయాలి. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, బాధ్యతాయుతమైన వినియోగంతో భవిష్యత్ భారతావనికి బలమైన పునాదులు వేద్దాం. రాజకీయాల కంటే దేశ ప్రయోజనాలే మిన్న అని చాటిచెబుదాం అని పింగళి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు.



# మత్తుకు దూరంగా.. ఉజ్వల భవిష్యత్తుకు దగ్గరగా...

• కుటుంబాల విచ్ఛిన్నానికి మత్తు మార్గం • డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎక్సైజ్ ఎస్పీ కిరణ్ నాయక్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),మే13:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ ఎస్పీ బి.కిరణ్ నాయక్ పిలుపునిచ్చారు.బుధవారం జిల్లా కేంద్రంలో హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకై రూపొందించిన పోస్టర్లు,కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నేటి యువత వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తుతో పాటు కుటుంబాలను కూడా రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మత్తు పదార్థాల వల్ల అటు యువతీయువకులు ఇద్దరూ తీవ్రంగా నష్టపోతారని ఇది సామాజిక సమతుల్యతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి డ్రగ్స్ లేని సమాజ నిర్మాణం కోసం నడుం బిగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపెల్లి హుస్సేన్,ఎక్సైజ్ సీఐతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దె వీరభద్రం,జిల్లా ఎడ్యుకేషనల్ సెల్ ప్రతినిధి శ్రీకాంత్ గౌడ్,భానుత్ సంతోష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# సైలెన్సర్లు మార్చారా? తస్మాత్ జాగ్రత్త

• మల్కాజిగిరిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ • గర్జించే సైలెన్సర్లపై పోలీసుల ఉక్కుపాదం • ఒక్క రోజే 451 కేసులు నమోదు..రూ.6.14 లక్షల జరిమానా

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),మే13:** నగరంలో పెరిగిపోతున్న శబ్ద కాలుష్యానికి అడ్డుకట్ట వేసేందుకు మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు.నిబంధనలకు విరుద్ధంగా వాహనాల సైలెన్సర్లను మార్చి,అధిక శబ్దంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న వాహనదారులపై విరుచుకుపడ్డారు.అతి శబ్దంతో సామాన్యులను బెంబేలెత్తిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా మార్చిన సైలెన్సర్లతో తిరుగుతున్న వాహనాలపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు.బుధవారం కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీగా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వివరాల్లోకి వెళ్తే..నగరంలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు ప్రజా శాంతిని కాపాడేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు బుధవారం (మే 13) ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.డీసీపీ (ట్రాఫిక్-1) పర్యవేక్షణలో కమిషనరేట్‌లోని ప్రధాన కూడళ్లు, రద్దీ మార్గాల్లో తనిఖీ బృందాలు మోహరించాయి. ధ్వని కాలుష్యానికి కారకమవుతున్న మోడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి అక్కడికక్కడే చర్యలు తీసుకున్నారు.


TELANGANA POLICE
MALKAJGIRI POLICE COMMISSIONERATE
CRACKDOWN ON VEHICLES AGAINST EMITTING SOUND POLLUTION USING SILENCER
REPORT ON SPECIAL DRIVE CONDUCTED ON 13-05-2026 IN TRAFFIC POLICE ZONES- I & II

| S.No. | Tr.PS/Div./Zone | Emitting Sound Pollution Using Silencer: Cases | Emitting Sound Pollution Using Silencer: Amount (₹) | Number Of Removed Silencers |
|---|---|---|---|---|
| 1 | Malkajgiri Tr. PS | 31 | 44000 | 15 |
| 2 | Gopalpuram Tr. PS | 52 | 73000 | 1 |
| 3 | Jawaharnagar Tr. PS | 21 | 30000 | 0 |
| 4 | Begumpet Tr PS | 74 | 103000 | 6 |
| 5 | Alwal Tr PS | 41 | 52000 | 7 |
| 6 | Trimulgherry Tr PS | 76 | 98000 | 7 |
| | Zone I Total | 295 | 400000 | 36 |
| 1 | LB Nagar Tr. PS | 47 | 70000 | 11 |
| 2 | Vanasthalipuram Tr. PS | 40 | 57000 | 29 |
| 3 | Uppal Tr. PS | 28 | 35000 | 0 |
| 4 | Kushaiguda Tr. PS | 24 | 32000 | 0 |
| 5 | Ghatkesar Tr. PS | 17 | 20000 | 0 |
| | Zone II Total | 156 | 214000 | 40 |
| | Traffic Zone – I & II | 451 | 614000 | 76 |

Sections: Emitting Sound Pollution Using Silencer: CMVR 120 r/w 190(2) MVA

A TOTAL OF (451) AND (76) MODIFIED SILENCERS WERE REMOVED CASES WERE BOOKED AGAINST EMITTING SOUND POLLUTION USING SILENCER

NO SILENCER NOISE POLLUTION | LOUD EXHAUST DISTURBS OTHERS | FOLLOW RULES RESPECT OTHERS | FINE & ACTION UNDER THE LAW | SILENCER FIT ON YOUR BIKE PEACE FITS IN OUR CITY | WEAR HELMET, RIDE SAFE | SCAN FOR TRAFFIC RULES

"Your loud exhaust is not music, it is noise pollution."

FOLLOW US ON Instagram@trafficmalkajgiripolice Facebook@MKJTRAFFIC Twitter@MKJTRAFFIC



### రికార్డు స్థాయిలో జరిమానాలు:


ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 451 కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు రూ.6,14,000ల జరిమానా విధించారు.తనిఖీల్లో పట్టుబడ్డ 76 వాహనాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సైలెన్సర్లను తొలగించారు.

### ఆరోగ్యంపై ప్రభావం:

సైలెన్సర్లను ఇష్టానుసారంగా మార్చడం వల్ల వచ్చే అధిక శబ్దం వృద్ధులు,రోగులు,చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పోలీసులు హెచ్చరించారు.ఇటువంటి చర్యలు రహదారి భద్రతకు విఘాతం కలిగించడమే కాకుండా ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నేరమని స్పష్టం చేశారు.వాహనదారులు మోటారు వాహన చట్టం ప్రకారం అనుమతించిన ప్రామాణిక సైలెన్సర్లను మాత్రమే వాడాలని మల్కాజిగిరి డీసీపీ సూచించారు.నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ తరహా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని
అదేబాటలో హోంమంత్రి అమిత్ షా
పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట




**న్యూఢిల్లీ,మే13:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

# పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం




పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం
ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మే13:** పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదనిరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఒఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలను కోరారు. బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారంపై కస్టమ్స్ సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి కేంద్రం పెంచింది. దీంతో బంగారం ధరలకు రెక్కలొచ్చాయి. గత కొంతకాలంగా చమురు ధరలూ పెంచుతారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బంగారం, వెండిలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు



• 6నుంచి 15 శాతానికి పెంచిన కేంద్రం

**న్యూఢిల్లీ,మే13:** బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్రం తాజాగా పెంచింది. బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతానికి, అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను 5 శాతానికి పెంచింది. దీంతో, మొత్తం దిగుమతుల సుంకం 15 శాతానికి చేరింది. గతంలో ఇది 6 శాతంగా ఉండేది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 95.75కి పతనమైన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని పెంచింది. బంగారం వినియోగంలో భారత్ ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. వెండి వినియోగంలో ప్రథమ స్థానంలో ఉంది. దేశీయ అవసరాల కోసం భారత్ ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇక ఈక్విటీ మార్కెట్‌లో రాబడులు మందగించిన నేపథ్యంలో గతేడాది భారత్‌లో బంగారానికి డిమాండ్ పెరిగింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో గోల్డ్ ఆధారిత ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 186 శాతం మేర పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే ధరలు అధికంగా ఉన్నందున కస్టమ్స్ డ్యూటీ పెంపుతో బంగారం, వెండికి డిమాండ్ తగ్గవచ్చని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బంగారం, వెండి దిగుమతుల కట్టడి కోసం ఇటీవల ప్రభుత్వం 3 శాతం ఐజీఎస్టీ విధించింది. దీంతో, బ్యాంకులు దిగుమతులకు దాదాపు నెల రోజుల పాటు బ్రేక్ చెప్పాయి. ఫలితంగా ఏప్రిల్‌లో దిగుమతులు 30 ఏళ్ల నాటి కనిష్ఠాన్ని తాకాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులను తట్టుకునేందుకు దేశ ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ ఆదివారం పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

# దెబ్బమీద దెబ్బ




ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న వేళ.. ఎరువుల కంపెనీలు అదను చూసి రైతులను దెబ్బకొట్టాయి. అమెరికా- ఇరాన్ యుద్ధం వల్ల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయంటూ దేశంలోని ఎరువుల కంపెనీలు ధరలను భారీగా పెంచేశాయి. ఈ ధరలు తక్షణం అమల్లోకొస్తాయని తెలిపాయి. అంతర్జాతీయంగా గ్యాస్, చమురు, ముడి సరుకుల ధరల పెరుగుదల, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను సాకుగా చూపి సబ్సిడీ పెంచాలని కంపెనీలు కేంద్రాన్ని కోరాయి. కానీ, సబ్సిడీ పెంపునకు అంగీకరించకుండా కంపెనీలే ధరలు పెంచుకోవడానికి మోడీ సర్కార్ అనుమతినిచ్చింది. అంతర్జాతీయంగా ఇలాంటి విపత్తులు ఎదురైనప్పుడు కేంద్రమే ఆ భారాన్ని భరించి రైతులపై పడకుండా చూడాలి.కానీ, కంపెనీలకే ఆ అధికారాన్ని అప్పగించడం ద్వారా ఈ ప్రభుత్వం రైతులపక్షం కాదు, కార్పొరేట్ పక్షమేనని మరోసారి రుజువైంది. ప్రస్తుతం కాంప్లెక్స్ ఎరువుల ధర యాభై కిలోల బస్తాపై రూ.225 నుంచి 300 వరకు, ఎంఓపీ (పొటాషియం) రేటు బస్తాకు రూ.125 పెరిగింది. ఇలాంటి ప్రభావం ఉన్నప్పుడు ఉత్పత్తి ఖర్చులు పెరిగితే కేంద్రం సబ్సిడీ ఇవ్వాలి. అంతేగాని ధరలు పెంచుకోవడానికి అనుమతి ఇవ్వడమేంటని రైతుసంఘాలు, మేధావుల ప్రశ్న. ప్రపంచ దేశాల్లో రైతులను, వ్యవసాయాన్ని ఆదుకోవాలంటున్న ఆయా ప్రభుత్వాలు.. మన దేశంలో పాలకులు రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ వారిని సాగుకు దూరం చేస్తున్నాయి. ఇప్పటికే ధర బాగున్నా చీడపీడలతో మిరప దిగుబడులు పతనమయ్యాయి. ఎక్కువ మొత్తంలో మక్కలు దిగుబడులొచ్చినా ధర లేదు. వానాకాలంలో పత్తి, పెసర పంటలు అధిక వర్షాలతో దెబ్బతిన్నాయి. వరి పంట పరిస్థితి అప్పుడు ఇప్పుడూ అదే పరిస్థితి. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక అప్పులపాలై ఎంతోమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు.పంటను అమ్ముకోలేకఎన్ని ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. కుప్పల మీదే ప్రాణాలు విడుస్తున్నారు. ఈ సమయంలో రైతులకు భరోసా కల్పించాల్సిన కేంద్రం ఎరువుల ధరలు పెంచడానికి అనుమతినివ్వడం బాధ్యత నుంచి తప్పుకోవడమే అవుతుంది. వ్యవసాయ రంగంలో విత్తనం తర్వాత అత్యంత కీలకమైనది ఎరువు. ముఖ్యంగా యూరియా, డీఏపీ, పొటాష్, ఎన్పీకే వంటి ఎరువులు లేకుండా సాగు అసాధ్యం. కానీ ఈ ఎరువుల ధరలు ప్రతి ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి సరుకుల ధరలు పెరిగాయని, దిగుమతి ఖర్చులు అధికమయ్యాయని, ఉత్పత్తి వ్యయం పెరిగిందని కంపెనీలు చెబుతుంటాయి. పైకి కంపెనీలు చెప్పినట్టు కనిపిస్తున్నా.. ప్రభుత్వమే వారి చేత ఈ మాటలు చెప్పిస్తున్నదన్న విమర్శల్ని కొట్టిపారేయలేం.

### ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కు

# నట్టికుమార్ రాజీనామా..

### కౌన్సిల్ తీరుపై విమర్శలు



తెలంగాణ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ పదవికి నిర్మాత నట్టి కుమార్ రాజీనామా చేశారు. కేవలం పదవిని వదులుకోవడమే కాకుండా, కౌన్సిల్ పనితీరులోని లోపాలను ఎత్తిచూపుతూ లేఖ రాశారు. నట్టి కుమార్ తన రాజీనామా లేఖలో కౌన్సిల్ నిర్వహణపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ఉండాల్సిన పర్సంటేజీ విధానం అమలులో కౌన్సిల్ పూర్తిగా విఫలమైందని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, మధ్యతరగతి నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఎగ్జిబిటర్ల ఆధిపత్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిల్ నిర్ణయాల్లో పారదర్శకత లేదని, కార్యవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరగడం లేదని... ఆడిటింగ్, ఆర్థిక నిర్వహణలో జవాబుదారీతనం లోపించిందని నట్టి కుమార్ లేఖలో వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా తాను ఏమీ చేయలేనప్పుడు ఆ పదవిలో కొనసాగడం అర్థరహితమని ఆయన పేర్కొన్నారు. తన రాజీనామా తర్వాతైనా సభ్యులందరూ మేల్కొని, సంస్థను పారదర్శకంగా నడిపించాలని ఆయన కోరారు.

## అవతార్-3... ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ!




జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అవతార్-3 ఫైర్ అండ్ యాష్ గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సినిమా త్వరలో అంతర్జాతీయ ఓటీటీలోకి రానుంది. డిస్నీప్లస్ వేదికగా జూన్ 24వ తేదీన ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని వెల్లడిస్తూ, నిర్మాణ సంస్థ పోస్టర్‌ను విడుదల చేసింది.అవతార్-3 చిత్రం థియేటర్లలో మంచి వసూళ్లను రాబట్టింది. వాస్తవానికి ఈ చిత్రం ఇప్పటికే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రెంటల్ ప్రాతిపదికన అందుబాటులో ఉంది.
జూన్ 24వ తేదీ నుంచి సబ్‌స్క్రిప్షన్ ఉన్న వినియోగదారులకు ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేకుండా సినిమాను వీక్షించవచ్చు.
అవతార్-3 భారతదేశంలో జూన్ 24వ తేదీనే జియో హాట్‌స్టార్‌లో అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. తెలుగు, హిందీ, తమిళం తదితర భాషల్లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. భారతదేశంలో ఈ సినిమా ఓటీటీ విడుదలపై ప్రకటన రావాల్సి ఉంది.



### నోరా కిల్లింగ్ లుక్

# : కాసులు, నాణేలతో ఒళ్లంతా సింగారం

గ్లోబల్ డాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి తన సరికొత్త ఫోటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. "నీ ఒళ్లు బంగారం కాను..!" అనేలా మెరిసిపోతున్న ఆ దివ్యమైన రూపం అభిమానుల కళ్లను తిప్పుకోనివ్వడం లేదు. భారతీయ సంప్రదాయ ఆభరణాలు... ఉత్తర ఆఫ్రికా సంస్కృతుల అరుదైన కలయికతో రూపొందించిన ఈ లుక్ నోరా కెరీర్‌లోనే అత్యంత ప్రయోగాత్మకమైన.. అందమైన ఫోటోషూట్‌లలో ఒకటిగా నిలుస్తోంది. ఈ ఫోటోషూట్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం ఒక -జల దేవత- రూపానికి ప్రాణం పోయడం. ఇందులో భాగంగా నోరా శరీరం నిండా బంగారు కాసులు, నాణేలతో కూడిన ఆభరణాల దుస్తులను డిజైన్ చేయించడం ఆసక్తిని కలిగించింది. ఈ గోల్డ్ జ్యువెలరీ ఈ బ్యూటీకి ఒక రాజసం ఉట్టిపడే భారతీయ సౌందర్యాన్ని అందించింది. నోరా నిజంగా ఒక దేవతలా వెలిగిపోతోంది. కేవలం భారతీయతకే పరిమితం కాకుండా.. ఈ లుక్‌లో నోరా తన మూలాలను కూడా ప్రతిబింబించింది. మొరాకోకు చెందిన -అమాజిగ్ బెర్బర్- సంస్కృతికి చెందిన బాడీ టాటూలను ఇందులో జోడించారు. ఈ టాటూలు, బంగారు ఆభరణాల కలయిక భారత్ - మొరాకో అనే రెండు భిన్నమైన ప్రపంచాల అద్భుతమైన సమ్మేళనంలా కనిపిస్తోంది. ఈ -ఫ్యూషన్- స్టైల్ నోరా ఫ్యాషన్ సెన్స్‌కు నిదర్శనంగా నిలుస్తోంది. నోరా ఫతేహి తన ఫిట్‌నెస్ - గ్రేస్‌తో ఈ లుక్‌కు పూర్తి న్యాయం చేసింది. కేవలం డ్యాన్స్‌లోనే కాదు.. ఫ్యాషన్ ప్రయోగాల్లోను తనే -క్వీన్- అని చాటుకుంది. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతుండటంతో.. నెటిజన్లు నోరా అందానికి .. ఆ వినూత్న ఆలోచనకు ఫిదా అయిపోతున్నారు.





# స్టైల్‌లో తగ్గేదేలే..

### జెన్-జీ ఫ్యాషన్‌తో మెస్మరైజ్ చేస్తున్న మెగాస్టార్.. బాస్ సరికొత్త లుక్ వైరల్!

త్వరలో బాబీ కొల్లి దర్శకత్వంలో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం మెగాస్టార్ చిరంజీవి వయసును వెనక్కి నెడుతూ సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. గతంలో కంటే మరింత స్లిమ్‌గా, ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్న ఆయన తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కఠినమైన క్రమశిక్షణ, నిరంతర శ్రమతో ఆయన తన ఫిట్‌నెస్‌ను ఎలా కాపాడుకుంటున్నారో ఈ లుక్ స్పష్టం చేస్తోంది. వ్యక్తిగతంగానూ ఆయనలోని ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదని, యంగ్ లుక్‌తో అభిమానులను ఫిదా చేస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.ప్రస్తుత తరం ఫ్యాషన్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా, జెన్-జీ ప్రేరణతో కూడిన ట్రెండీ దుస్తులను చిరంజీవి అలవోకగా ధరిస్తున్నారు. ఆయన స్టైల్ ఎప్పటికీ ప్రత్యేకమేనని నిరూపిస్తున్నారు. సమకాలీన డ్రెస్సింగ్ అయినా, మోడరన్ ఎస్తటిక్స్ అయినా.. ప్రతి లుక్‌ను 'బాస్' మాత్రమే క్యారీ చేయగల ప్రత్యేకమైన స్వాగ్‌తో ప్రదర్శిస్తున్నారు.ఒకవైపు తన లుక్‌తో వార్తల్లో నిలుస్తూనే, మరోవైపు తన తదుపరి సినిమా కోసం ఆయన సిద్ధమవుతున్నారు. త్వరలోనే దర్శకుడు బాబీ కొల్లితో చేయబోతున్న కొత్త సినిమా షూటింగ్‌లో చిరంజీవి పాల్గొననున్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

# సిల్వర్ గౌనులో దేవకన్యలా ఊర్వశి రౌతేలా..

### కేన్స్‌లో మరోసారి తన మార్క్ చూపిన బ్యూటీ!



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 79వ ఎడిషన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరాలో మే 12 నుంచి 23 వరకు జరిగే ఈ వేడుకకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ, ఫ్యాషన్ ప్రముఖులు హాజరయ్యారు. అలియా భట్, డెమీ మూర్ వంటి తారలు ప్రారంభోత్సవంలో తమ స్టైల్‌తో ఆకట్టుకోగా, బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనదైన ప్రత్యేకమైన డ్రెస్సింగ్ స్టైల్‌తో రెడ్ కార్పెట్‌పై ప్రధాన ఆకర్షణగా నిలిచారు.
ప్రారంభోత్సవం కోసం ఊర్వశి వియత్నాంకు చెందిన ఫ్యాషన్ లేబుల్ 'జోలీపోలీ' డిజైన్ చేసిన కస్టమ్ కౌచర్ గౌనును ఎంచుకున్నారు. లావెండర్ రంగు బేస్‌పై భారీ సిల్వర్ అలంకరణతో ఉన్న ఈ గౌను చూడగానే కట్టిపడేసింది. క్రిస్టల్స్, సీక్విన్స్, పూసలు, రాళ్ల వర్క్‌తో గౌను మొత్తం కేన్స్ లైట్ల వెలుగులో తళతళా మెరిసింది. మత్స్యకన్య ఆకారాన్ని పోలి ఉన్న ఈ గౌను ఆమె అందాన్ని రెట్టింపు చేసింది.
ఈ డ్రెస్ ప్రత్యేకతల్లో కార్సెట్ తరహాలో ఉన్న బాడీస్ ఒకటి. గౌనుపై శిల్పం చెక్కినట్టుగా వెండి ఎంబ్రాయిడరీతో సున్నితమైన డిజైన్లు ఉన్నాయి. స్వీట్‌హార్ట్ నెక్లైన్‌తో పాటు భుజాల వద్ద ఉన్న అలంకరణలు డ్రెస్‌కు మరింత ఆకర్షణను తెచ్చిపెట్టాయి. పొడవైన కేప్ స్లీవ్స్, వాటికి వేలాడుతున్న క్రిస్టల్ టాసెల్స్... వెండి రెక్కలు తొడుక్కున్నట్టుగా ఆకర్షించాయి.
"ఐసీ సిల్వర్" థీమ్‌కు తగ్గట్టుగానే ఊర్వశి ఆభరణాలను ధరించారు. స్టేట్‌మెంట్ చోకర్ నెక్లెస్, దానికి సరిపోయే చెవిపోగులు, బ్రేస్‌లెట్‌తో పాటు జుట్టు ముడి మధ్యలో పక్షి ఆకారంలో ఉన్న మాంగ్ టిక్కా తరహా తల ఆభరణం అందరి దృష్టినీ ఆకర్షించింది. గౌను మొత్తం ఒకే రంగులో ఉన్నప్పటికీ, ఆమె చేతిలో పట్టుకున్న రంగురంగుల రాళ్లు, అద్దాలతో పొదిగిన బాక్స్ క్లచ్ ప్రత్యేకంగా నిలిచింది. ఇక పూర్తి గ్లామ్ మేకప్‌తో ఊర్వశి మరింత ప్రకాశవంతంగా కనిపించారు. సిల్వర్ షిమ్మర్ ఐస్, నిగనిగలాడే పెదవులు, ముఖానికి ఫ్రేమ్‌లా ఉన్న హెయిర్‌స్టైల్‌తో తన లుక్‌ను పూర్తి చేశారు.

# ఈ నెల 23న భోపాల్ లో 'పెద్ది' రీసౌండ్ ఖాయం!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ప్రమోషన్లకు ఒక గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో కిక్ ఇచ్చేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ మేరకు మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.
'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో జరగనున్న ఈ ఈవెంట్‌లో భాగంగా సినిమాలోని ఒక ప్రత్యేక గీతాన్ని పరిచయం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆకర్షణగా సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. ఆయన ఈ వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్లు మేకర్స్ తెలిపారు. దీంతో ఈ ఈవెంట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.
బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్‌తో పాటు జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. భోపాల్ ఈవెంట్‌తో సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు.కాగా, మే 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ అవుతున్న సంగతి తెలిసిందే. ముంబైలో పెద్ది ట్రైలర్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ గా నిర్వహించనున్నారు. దీంతో ఈ చిత్రం ప్రమోషన్స్ అధికారికంగా ప్రారంభం కానున్నాయి.